తెలుగుప్రభ
మన భాష.. మన పత్రిక
teluguprabha.net
-TeluguPrabha
@TeluguPrabhaofficial
TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm
గురువారం 3-8-2023



# బీఆర్ఎస్ అంటే భారత రైతు సమితి

## ట్విట్టర్ వేదికగా కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్ట్3(తెలుగుప్రభ):**

బీఆర్ఎస్ అంటే భారత రైతు సమితి అని మరోసారి రుజువైంది అంటూ మునిసిపల్ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా స్పందించారు.'' జై కిసాన్ అనేది మాకు కేవలం ఓ నినాదం కాదు.. మా ప్రభుత్వ విధానం అని మరోసారి

తేలిపోయింది.కేంద్రంఅనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం తగ్గినా

బీజేపీ సర్కారు అడుగడుగునా ఆర్థిక ఇబ్బందులు సృష్టించినా, రైతు రుణమాఫీని సంపూర్ణంగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం..ముఖ్యమంత్రి కేసిఆర్ గారి సంకల్ప బలానికి నిలువెత్తు నిదర్శనం.రైతు సంక్షేమంలో తొమ్మిదేళ్ల తెలంగాణ ప్రస్థానం దేశ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయం.

రైతుకు రక్షణ కవచంగా అమలుచేసిన ప్రతి పథకంవ్యవసాయ రంగ చరిత్రపై చెరగని సంతకం. దేశవ్యాప్తంగా వ్యవసాయం అంటే సంక్షోభం కానీ.. ఒక్క తెలంగాణలోనే వ్యవసాయం అంటే సంతోషం యావత్ తెలంగాణ రైతాంగం ముక్తకంఠంతో చేస్తున్న నినాదమిది'' అంటూ పేర్కొన్నారు. రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడాన్ని ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఓవర్‌లోడ్

## కాంగ్రెస్ కొంప ముంచేనా?



పార్టీ కోసం పని చేస్తున్నవారికి 'మొండిచేయి' తప్పదా?

ఇక చాలు అంటున్నా పట్టించుకోని హైకమాండ్

టికెట్ ఆశించేవారి గుండెల్లో గుబులు

రెబల్స్ పెరిగితే మొదటికే మోసం

**కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ బుల్లెట్ ట్రైన్ కంటే వేగంగా దూసుకుపోతోంది. కొత్త నాయకుల చేరికతో ఆ పార్టీ ఫుల్ జోష్‌లో ఉంది. కానీ ఎన్నికల నాటికి ఇదే ఆ పార్టీ కొంప ముంచుతుందా..?**

తెలంగాణ కాంగ్రెస్‌లో చేరికల జోష్ జోరుగా సాగుతోంది. 'రోజుకో లీడర్' చొప్పున వచ్చే ఎన్నికలలో బీఆర్ఎస్‌లో టికెట్ రాదని నిజం గ్రహించిన నేతలతో పాటు కాస్త పేరు, బలగం ఉన్న చోటా మోటా నాయకులు కూడా తమ 'హస్తవాసి' ఏమైనా మారకపోతుందా..? అనే ఆశతో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటున్నారు. వీరికి తోడు కాంగ్రెస్‌లో గత కొంతకాలంగా 'ఎన్ఆర్ఐ'ల చేరికలు కూడా ఆ పార్టీ ఆశించినదానికంటే ఎక్కువే అవుతున్నాయి. ఇక్కడివరకూ బాగానే ఉన్నా కొత్తగా వచ్చిన ఎన్ఆర్ఐ లతో తమ సీటుకు ముప్పు ఎక్కడ వస్తుందోనని ఇప్పటికే చాలాకాలంగా నియోజకవర్గాల్లో 'సీటు నాకే' అని ధీమాగా ఉన్న నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. రాష్ట్రంలోని పాలకుర్తి, కల్వకుర్తి, ఆదిలాబాద్, నాగర్ కర్నూల్, మక్తల్‌తో పాటు ఇతర నియోజకవర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులకు నిద్రలు కరువవుతున్నాయి.

**హైదరాబాద్, ఆగస్ట్ 3 (తెలుగు ప్రభ)**

### మాకంటే మాకే..

కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎన్ఆర్ఐలు నియోజకవర్గాల్లో నిత్యం ప్రజలతో మమేకమవుతున్నారు. పిలిచిన పేరంటాలకే కాదు.. పిలవని తంతులకూ హాజరవుతున్నారు. ఇది ఇప్పటికే అక్కడ ఉన్న 'కాంగ్రెస్ ఆశావాహుల'కు కంటగింపుగా మారుతున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేరున్న నాయకుడు జంగా రాఘవరెడ్డి. గతంలో ఆయన జనగాం జిల్లా డీసీసీ ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నుంచి పోటీ చేసి ఎర్రబెల్లి దయాకరరావు చేతిలో ఓడిపోయారు. రాబోయే ఎన్నికలలో మరోసారి ఇదే నియోజకవర్గం నుంచి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. కానీ కొంతకాలంగా అక్కడ ఎన్ఆర్ఐ ఝాన్సీ రెడ్డి.. రాఘవరెడ్డికి ధీటుగా ప్రజలతో మమేకమవుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఏఐసీసీ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే వంశీచందర్ రెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. కానీ ఇటీవలే పార్టీలో చేరిన సుంకిరెడ్డి రాఘవేంద్రరెడ్డి టికెట్ తనకే వస్తుందన్న ధీమాతో ఉన్నారు.

ఆదిలాబాద్‌లో ఎన్ఆర్ఐ కంది శ్రీనివాస రెడ్డి ఇటీవలే హస్తం తీర్థం పుచ్చుకున్నారు. దాదాపు ఇక్కడ ఆయనకే టికెట్ ఖాయమన్న ప్రచారమూ జరుగుతోంది. కానీ అక్కడ ప్రజలతో మమేకమై ఉన్న కాంగ్రెస్ నాయకురాలు జి. సుజాత మాత్రం పార్టీకోసం పనిచేసిన తనకే టికెట్ కేటాయించాలని కోరుతున్నారు.

ఇక నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి పోటీకి సిద్ధమవుతుండగా.. ఇటీవలే కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్సీ దామోదరరావు.. తన కుమారుడికి టికెట్ కోసం పట్టుబడుతున్నారట. ఈ షరతు మీదే ఆయన కాంగ్రెస్‌లో చేరినట్టు తెలుస్తోంది. మహబూబ్‌నగర్‌లోని మరో నియోజకవర్గం మక్తల్‌లో కూడా స్థానికంగా పేరున్న వాకిటి శ్రీహరి ముదిరాజ్‌కు టికెట్ ఖాయమని నిన్నామొన్నటిదాకా ప్రచారం జరిగినా తాజాగా అక్కడ ఎన్ఆర్ఐ చంద్రశేఖర రెడ్డి ఎంట్రీతో సమీకరణాలు మారినట్టు సమాచారం.

### కొత్తనీరుతోనూ ప్రమాదమే..

బీఆర్ఎస్ నుంచి టికెట్ రాదని తెలిసినవాళ్లు చాలామంది కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నారు. ఇటీవలే మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, గద్వాల జిల్లా పరిషత్ ఛైర్మన్ సరితాలు హస్తం పార్టీలో చేరారు. శుక్రవారం నిజామాబాద్‌లో ప్రముఖ వ్యాపారి, ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత సునీల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. సునీల్ రెడ్డి ఆర్మూర్ నుంచి పోటీ చేస్తారని సమాచారం. దీంతో ఇక్కడి కాంగ్రెస్ ఆశావాహులకు కూడా ఇది మింగుడుపడకుండా ఉంది.

### చేరికలు వద్దంటూ..

'ఉమ్మడి నల్గొండ జిల్లాలో కొత్తగా ఎవ్వరు చేరే అవసరం లేదు. మా 12 సీట్లు కాంగ్రెస్‌కు రిజర్వ్ అయినయి. రిజర్వ్ చేసి పెట్టినం కాంగ్రెస్ కోసం. 12 గెలుస్తున్నం..' అంటూ కొత్తగా చేరికలు వద్దని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఇవి. ఒకవైపు కొత్త చేరికలు వద్దని, ఒకవేళ తప్పనిసరి అయితే వారిని షరతులతో చేర్చుకోవాలని సీనియర్ నాయకులు చెబుతున్నా అవేవీ టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. మరి 'టికెట్ ఆకర్ష్' వ్యవహారాలు కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో లాభిస్తాయా..? అన్నది కాలమే తేల్చాలి. ఎన్నికలలో పోటీ చేసేందుకు టికెట్ రాని నాయకులు రెబల్స్‌గా మారితే మాత్రం అది మొదటికే మోసమన్న ఆందోళనలో కాంగ్రెస్ శ్రేణులు ఉన్నాయి.

# కాంగ్రెస్‌లో చేరిన జూపల్లి




**న్యూఢిల్లీ,ఆగస్ట్3(తెలుగుప్రభ):**

ఎట్టకేలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తన నియోజకవర్గ కేంద్రమైన కొల్లాపూర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి..కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంకగాంధీ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవాలనుకున్న జూపల్లి కోరిక వివిధ కారణాలతో తీరలేదు. కొద్దిరోజుల వరకు ప్రియాంక యాత్ర ఖరారు కాకపోవడం, తర్వాత ఎడతెగని వర్షాలు, ఇలా వివిధ కారణాలతో ఆయన చేరిక వాయిదా పడింది. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో ఇంకా ఆలస్యం కూడదనే తలంపుతో బుధవారమే పార్టీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే సమక్షంలో చేరేందుకు ఢిల్లీ వచ్చినప్పటికీ, ఖర్గే బిజీ వల్ల అది సాధ్యం కాలేదు. గురువారం ఉదయం ఖర్గే నివాసంలో జూపల్లి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతోపాటు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, వనపర్తి,పెద్దమందడి ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుంట్ల దామోదర్‌రెడ్డి కుమారుడు రాజేశ్వర్‌రెడ్డి పార్టీలోచేరారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావ్‌ఠాక్రే, ఎంపీలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు మల్లురవి, వేణుగోపాల్ , తదితరులు పాల్గొన్నారు.

# చార్జర్‌తో ఆడుకోబోయి చిన్నారి మృతి

**బెంగళూరు, ఆగస్ట్3(తెలుగుప్రభ):**

పెద్దలతోపాటు పిల్లలు కూడా సెల్‌ఫోన్లకు బాగా అలవాటుపడటం తెలిసిందే. పిల్లలు గోలచేసినా, ఏడ్చినా సెల్‌ఫోన్ చేతికిచ్చి ఊరడించడం పెద్దలకు తేలికైన పరిష్కారంగా కనిపిస్తోంది. పసిపిల్లలు సైతం సెల్‌పోన్లకు అలవాటు పడతుండటం చాలా ఇళ్లలో కనిపిస్తోంది. వారు ఫోన్లకు అలవాటు పడేలా చేయడమే కాదు.. పిల్లలు సెల్‌ఫోన్ల దగ్గరకు వెళ్లకుండా చూడాల్సిన అవసరముందంటున్నారు. కర్నాటకలో ఓచిన్నారి సెల్‌ఫోన్ చార్జర్ పిన్‌ను నోట్లో పెట్టుకోగా, షాక్ కొట్టి మృతి చెందడమే ఇందుకు కారణం. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉత్తర కన్నడ జిల్లాకు చెందిన ఓ ఇంట్లో సెల్‌ఫోన్ చార్జర్‌ను సాకెట్‌లోకి ప్లగ్‌చేసి స్విచ్ వేసి ఉంచారు. ఇంట్లోనే పాకుకుంటూ అటుగా వెళ్లిన ఎనిమిది నెలల చిన్నారి ఆటవస్తువుగా భావించి చార్జర్ పిన్‌ను నోట్లో పెట్టుకుంది. షాక్ కొట్టడంతో గమనించిన తల్లిదండ్రులు వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లినా, అప్పటికే పాప మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.



# జ్ఞానవాపి మసీదులో సర్వే చేయొచ్చు

## – అలహాబాద్ హైకోర్టు

**అలహాబాద్, ఆగస్ట్3(తెలుగుప్రభ):**

వారణాసిలోని కాశీవిశ్వనాథ ఆలయ సమీపంలోని జ్ఞానవాపి మసీదు ఆవరణలో సర్వే నిర్వహించేందుకు అలహాబాద్ హైకోర్టు అనుమతించింది. భారత పురావస్తుశాఖ తన సర్వేను కొనసాగించవచ్చునని స్పష్టం చేసింది. వారణాసి కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ మసీదుకమిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. మసీదు ప్రాంగణంలో శాస్త్రీయ సర్వే నిర్వహించాల్సిందిగా వారణాసి జిల్లా కోర్టు జూలై21న తీర్పునివ్వగా, అందుకనుగుణంగా పురావస్తుశాఖ అధికారులు సర్వే చేపట్టారు. దాన్ని వ్యతిరేకిస్తూ మసీదుకమిటీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన సుప్రీంకోర్టు సర్వేపై రెండురోజుల స్టే విధించింది. వారణాసి కోర్టు తీర్పుపై అలహాబాద్ హైకోర్టుకు వెళ్లవలసిందిగా మసీదు కమిటీకిసూచించించడంతో వారణాసికోర్టు తీర్పును సవాల్‌చేస్తూ హైకోర్టుకు వెళ్లిన నేపథ్యంలో తాజాగా సర్వేకు అనుమతిస్తూ తీర్పునిచ్చింది.






# అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

## తొలుత సంతాప తీర్మానం

**హైదరాబాద్, ఆగస్ట్3 (తెలుగుప్రభ)**



తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలుత దివంగత కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్నకు శాసనసభ్యులు నివాళులు అర్పించారు. అనంతరం సభలో సీఎం కేసీఆర్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో శాసన సభ్యుడిగా, ఇతర అనేక హోదాల్లో పని చేశారన్నారు. ఆయన వ్యక్తిగతంగా మంచి అనుబంధం ఉందన్నారు. ఎటువంటి సందర్భంలోనైనా చిరునవ్వుతో చాలా ఓపికతో ఉండేవారని, అందరితో కలుపుగోలుగా ఉండేవారని సీఎం కేసీఆర్ గుర్తు చేసుకున్నారన్నారు. సాయన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తాను ముఖ్యమంత్రిని అయ్యాక.. అనేక సందర్భాల్లో ఏదైనా ప్రయత్నం చేసి హైదరాబాద్ జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్‌ను కలిపేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. కంటోన్మెంట్ ప్రజలకు చాలా తపనపడేవారన్నారు. అనేక సందర్భాల్లో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపాం.ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేసి కంటోన్మెంట్లను నగరపాలికల్లో కలపాలని ఆలోచిస్తుందన్న శుభవార్త అందింది. ఆ రకంగానైనా సాయన్న కోరిక నెరవేరాలని కోరుకుంటున్నానన్నారు. సాయన్న నిజామాబాద్ జిల్లాలో జన్మించారని, హైదరాబాద్ జీహెచ్ఎంసీలో సెటిలై.. వ్యాపారవేత్తగా ఉన్నారన్నారు. ఆయన వివాదరహిత నేతల్లో ఆయన ఒకరని, ఆయన కూతురు సైతం నగరంలో కార్పొరేటర్‌గా సేవలందించిందన్నారు. సాయన్న కుటుంబం తమ కుటుంబంలాంటిదన్నారు. ఆయన లేని లోటు తీరనిదని, కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

# ప్రతిపక్షాలకు మాస్టర్ స్ట్రోక్

**హైదరాబాద్, ఆగస్ట్3 (తెలుగుప్రభ)**

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో విపక్షాలకు దిక్కుతోచడం లేదని మంత్రి హరీష్ రావు అన్నారు. అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ విలీనం, రైతు రుణమాఫీ, పోడు భూములకు పట్టాలు, వీఆర్ఏల సర్దుబాటుతో ప్రతిపక్షాలకు మాస్టర్ స్ట్రోక్ ఇచ్చామన్నారు. ప్రభుత్వం వైపు నుంచి దెబ్బమీద దెబ్బ తగలడంతో విపక్షాలు తట్టుకోలేక పోతున్నాయన్నారు. కేసీఆర్ తీసుకుంటున్న కీలక నిర్ణయాలతో ప్రతిపక్షాలకు ఏం మాట్లాడాలో తెలియకుండా పోతోందన్నారు. వరుస నిర్ణయాలతో ప్రతిపక్షాలకు వాయిస్ లేకుండా పోయిందని.. బయటే కాదు అసెంబ్లీ లోపల కూడా ప్రతిపక్షాలను కడిగి పారేస్తమన్నారు మంత్రి హరీష్ రావు.

# బ్రిడ్జి పై నుంచి వాగులోకి..

## కూరగాయల లోడ్ వ్యాన్

**కరీంనగర్, ఆగస్ట్3 (తెలుగుప్రభ)**

నిర్మల్ జిల్లా మాటేగాం వద్ద ప్రమాదం జరిగింది. బ్రిడ్జిపై నుండి కూరగాయల వాహనం వాగులో పడింది. పచ్చిమిర్చి కాకరకాయ లోడుతో మహారాష్ట్ర నుండి... కరీంనగర్ వెళ్తున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో పోలీసులు వ్యాన్‌ను వాగులోంచి బయటకు తీయించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# అయ్యో.. ఉన్న జుట్టు ఊడింది..

**హైదరాబాద్, ఆగస్ట్3 (తెలుగుప్రభ):**

కొండ నాలుక్కి మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్నట్లు తయారైంది ఆ మహిళ పరిస్థితి. తనను మోడల్‌గా చూడాలని కోరుకుంటున్న భర్త కోరిక తీర్చేందుకోసం నగరంలోని ఓ మహిళ చక్కటి,చిక్కటి జుట్టుకోసమంటూ ఓ బ్యూటీపార్లర్‌కు వెళ్లింది. హెయిర్ ట్రీట్‌మెంట్‌లో భాగంగా కొంత జుట్టు కత్తిరించి హెయిర్‌ఆయిల్ పెట్టారు. అంతలోనే జుట్టు రాలిపోతుండటంతో ఆందోళన చెందిన ఆ మహిళ పాతబస్తీలోని తన ఇంటికి చేరుకుంది. జుట్టూ ఊడి వచ్చిన భార్యను చూసిన భర్త షాకయ్యాడు. ఇద్దరిమధ్య గొడవ కూడా జరిగింది. దీంతో సదరు మమిళ ఊడుతున్నవెంట్రుకలతోనే నేరుగా బ్యూటీ సెలూన్‌కు దగ్గరిలోని ఆబిడ్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది.బ్యూటీపార్లర్‌పై కేసు నమోదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.